కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 02 నవంబర్ 2025

## పింఛన్ల పంపిణీలో కలెక్టర్

**చిన్నమండెం, నవంబర్ 01 ప్రభాతవార్త:**



శనివారం ఉదయం చిన్నమండెం మండలం దేవగుడిపల్లె గ్రామం రాజీవ్ కాలనీ లో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల పింఛను వితంతు పింఛన్ మరియు వృద్ధాప్య పింఛన్ల పంపిణీ స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దనే పెన్షన్ అందుతుందా, ఏ రోజు పింఛను అందుతోంది, ఎన్ని గంటల సమయంలో అందుతుంది, వంటి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు.

## నరసింహ స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు

**మదనపల్లి నవంబర్ 1 ప్రభాతవార్త**



పట్టణ సమీపంలోని ఆనప గుట్ట శ్రీవారినగర్‌లో వెలసిన శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాస ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ స్వామి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో తొలి ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా వైభవంగా ఏకాదశి పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ప్రపంచంలో భారతదేశాన్ని మేటిగా నిలపాలి







**కడప, నవంబర్ 01, ప్రభాతవార్త**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రెండు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కడప విమానాశ్రయమునకు చేరుకొన్నారు. విమానాశ్రయంలో మాజీ ఉపరాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో పాటు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఆర్అండ్‌బి అతిథి గృహంకు చేరుకున్నారు. అనంతరం సాయంత్రం యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియం నందు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ సమైక్యతను, సంస్కృతిని, విలువలను కాపాడాలన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలోని నూతన పరిపాలనా భవనంలోని అన్నమయ్య సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవ వేడుక సభలో పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులకు భారత ఔన్నత్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొప్పదనం, తెలుగు భాష తీయదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి మనోభావాలను అందిపుచ్చుకుని విలువైన సందేశాన్నిచ్చారు. దేశ సమైఖ్యతకు, దేశ అభివృద్ధికి, దేశ విలువలను కాపాడడంలో.. నేటి యువత కీలక పాత్ర పోషించాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని, విద్యా వికాశంతో పాటు యోగా, క్రీడలు, కళలు, సాహిత్యం, మానసిక వికాసంపై దృష్టి సారించాలన్నారు. మన కట్టుబొట్టు, మన సంస్కృతి సంప్రదాయాలు, మన వేశాభాషలు, మన యాసకు కాపాడుకోవడం ముఖ్యం అని, అందం, చందం, హుందాతనం.. అన్నీ అవసరమే.. వాటితో పాటు మాటతీరు, మర్యాద మన్ననలు, పెద్దలంటే గౌరవం, ఆరోగ్యకరమైన భారతీయ ఆహారపు అలవాట్లను అవలంభించాలన్నారు. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయాలి, ప్రతి ఒక్కరూ.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని కేటాయించాలి. ప్రేమనుబంధాలను బలపరుచుకోవాలి, అనురాగం.పెంపొందించాలన్నారు. ఈర్ష్య ద్వేషాలను పక్కన పెట్టి ఆప్యాయత, అనురాగాలను పెంపొందించాలని విద్యార్థులకు హితోపదేశం చేశారు.

విద్యార్థులు తెలివితేటలకు సాన పెట్టి కొత్త సవాళ్లను అధిగమిస్తూ ప్రపంచంలో భారతదేశాన్ని మేటిగా నిలిపేలా క్రమశిక్షణ గలిగిన పౌరులుగా తయారవ్వాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఉద్బోదించారు. ప్రపంచంలోకెల్లా గొప్ప ప్రజాస్వామ్య దేశం భారతదేశానిదేనన్నారు. ప్రపంచంలోని 12 మల్టీ నేషనల్ కంపెనీలలో భారతీయులు సీఈవోలుగా ఉన్నారని వివరిస్తూ దేశం బలోపేతం కావాలంటే, యువత తమలో ఉన్న శక్తి సామర్థ్యాలను వినియోగించాలన్నారు. నవభారత ఏక్తా శిల్పి సర్దార్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని ఉద్బోదించారు. యువత తమ వ్యక్తిత్వాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి, యోగి వేమన బోధనలు మార్గదర్శకాలన్నారు. ఆయన పద్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలని, గురువులను, పెద్దలను గౌరవించాలన్నారు. గురువు కేది ప్రత్యామ్నాయం కాదని గూగుల్ చెడిపోయిన మరమ్మత్తు చేసేది గురువేనన్నారు.యువత సృజనాత్మక శక్తిని కోల్పోకూడదు. టెక్నాలజీని కొంతవరకే సద్వినియోగం చుకోవాలన్నారు.సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లను అనుసరించాలని, వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తూ ఆరోగ్యవంతంగా నైపుణ్యత గల యువతగా తయారు కావాలన్నారు. విద్యా వికాసంతో పాటు యోగా, క్రీడలు,సాహిత్యం, కళలు, మానసిక వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. వైవియు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన చిత్రకళ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రం ఆకట్టుకునేలా ఉన్నాయంటూ వారి సృజనాత్మకతను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో వైవియూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజ శేఖర్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, యూనివర్సిటీ ఆచార్యులు, అధ్యాపకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.









## జీఎన్ఎస్ఎస్, కడప స్పెషల్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్

**కడప, నవంబర్ 1, ప్రభాతవార్త :**



అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ గా అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు జీఎన్ఎస్ఎస్ (ఎల్.ఏ.) స్పెషల్ కలెక్టర్ (ఎఫ్.ఏ.సి.)గా విధులు నిర్వహించిన ఎస్. నీలమయ్య రిలీవ్ అవ్వడంతో ఆ స్థానాన్ని అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయించడం జరిగింది. ఆ మేరకు అన్నమయ్య జిల్లా జేసీ ఛాంబర్ లో జీఎన్ఎస్ఎస్ (ఎల్.ఏ.), కడప స్పెషల్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పథకంలో భాగంగా అన్ని రకాల భూసేకరణ, పరిహారం, విస్తరణ సంబందిత అన్నిరకాల పరిపాలన వ్యవహారాలను సమర్థవంతంగా పెండింగ్ లేకుండా చర్యలు చేపడతామన్నారు.

## హోంగార్డు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత





**కడప, నవంబరు 1, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఆదేశాల మేరకు హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ హోంగార్డు యూనిట్ల పరిశీలన నిమిత్తం జిల్లాకు శనివారం విచ్చేసి ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో హోంగార్డులకు దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డు సంక్షేమానికి జిల్లా ఎస్పీ ఎంతగానో కృషి చేస్తున్నారని కావునా ప్రతి ఒక్కరు దురలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు ఉండడం వలన వచ్చే ఉపయోగాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే వచ్చే నష్టాలను తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ పీఎంజేజేబీవై మరియు పీఎంఎస్‌బీవై పాలసీలు తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. హోంగార్డులు పోలీసు వారితో సమానంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేరాలను అరికట్టడంలో పోలీసులకు వెన్ను దన్నుగా ఉంటున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంబవించినప్పుడు పండగలు, వీఐపీలు, వీవీఐపీలు పర్యటనలకు వచ్చే సందర్భంలో పోలీసులకు వారి సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. హోంగార్డులు తమ సేవల్ని చిత్తశుద్ధితో నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలరెడ్డి, హోంగార్డులు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ

**కడప, నవంబరు 1, ప్రభాతవార్త:**



కడప నగర పర్యటనకు శనివారం దేశ మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను కడప విమానాశ్రయంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## సంక్షేమానికి భరోసా పింఛన్ల పంపిణీ

**టిడిపి ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు**

**రాజంపేట, నవంబర్1 ప్రభాతవార్త**



రాజంపేటలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జగన్మోహన్ రాజు

సూర్యుడు ఉదయించక ముందే ఇంటి దగ్గరికి వెళ్లి పంపిణీ చేసే పింఛన్ల పంపిణీ కార్యక్రమం కుటుంబానికి భరోసా ఇస్తుందని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్రాజు అన్నారు. శనివారం రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూనెవారి పల్లి రోడ్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అవ్వ తాతలకు4000, వికలాంగులకు6000, కిడ్నీ కాలేయం తలసామియా బాధితులకు10000, పూర్తి అంగవైకల్యం కలిగిన బాధితులకు 15 వేల రూపాయలు చొప్పున మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఐదు రెట్లు పెంచి అవ్వ తాతలు ఒకరి మీద ఆధారపడకుండా వారు చిరునవ్వుతో ఉండాలని వారింట్లో ఒక పెద్ద కొడుకుగా మీకు తోడుగా నేను ఉండాలంటూ వారికి ధైర్యం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, అక్షర స్కూల్ అధినేత దొంతం శివ ప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, రాజంపేట క్లస్టర్ ఇంచార్జ్ వెంకటేశ్వర్ల నాయుడు, పార్లమెంట్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, వరదయ్య గారి పల్లి సర్పంచ్ హరి,టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, మైనార్టీ నాయకులు, కరీం, రాంనగర్ నరసింహ, ఎస్సీ నాయకులు మంద శీను, రాజంపేట పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు పాండురాజు, గుణకాల చిన్న ,తులసి నాగేంద్ర, పలువురు సచివాలయ సిబ్బంది, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చేస్తున్న ఆసుపత్రి సీజ్







**ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 1, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరులో లింగనిర్ధారణ చేసేందుకు స్థానిక గాంధీరోడ్డులోని సీఎన్ఆర్ నర్సింగ్ హోం నుంచి వివిధ ఆర్ఎంపీ క్లినిక్ వద్దకు స్కానింగ్ మిషన్ తీసుకెళ్లి స్కానింగ్ చేస్తున్న విషయాన్ని నర్సింగ్ హోం డా.ప్రతాపరెడ్డి స్కానింగ్ చేస్తున్న విషయాన్ని జిల్లా వైద్యాధికారులకు అందిన ఫిర్యాదుతో ఈ మధ్య కాలంలో స్కానింగ్ చేసే మిషన్‌ను జిల్లా వైద్యాధికారులు స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ వారు సీజ్ చేసిన విషయం తెలిసిందే. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కానింగ్ మిషన్‌ను మొబిలైజ్ చేయడం ఇతర ప్రాంతాలకు తరలించడం చట్టరీత్యా నేరం కనుక స్థానిక సీఎంఆర్ నర్సింగ్ హోం నందు ఉన్న డా.ప్రతాపరెడ్డి ఓపీ రూం, ల్యాబ్‌ను జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.గీత మాట్లాడుతూ స్కానింగ్ మిషన్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం చట్ట రిత్యా నేరమని అందువల్లే సీఎన్ఆర్ నర్సింగ్ హోం నందు ఉన్న స్కానింగ్ మిషన్‌ను, ల్యాబ్, మరియు డా.ఓపీ రూంను సీజ్ చేయడం జరిగిందన్నారు. కడప జిల్లాలో ఉన్న డాక్టర్లు, స్కానింగ్ సెంటర్ల వారు ఏ రూం స్కానింగ్ పరికరానికి పర్మిషన్ ఉందో అక్కడ మాత్రమే స్కానింగ్ మిషన్లు ఉండాలని పక్క రూం తరలించినప్పటికీ వారిపై చట్ట రిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయ సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేషన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాన్ని పరిశీలించిన జెసి

**చిన్నమండెం నవంబర్ 01 ప్రభాత వార్త:**



మండలంలో ఈ నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రదేశాన్ని శనివారం జేసి ఆదర్శ రాజేందర్,ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా గృహప్రవేశాలు చేసే ఇండ్లను పరిశీలించి తగుసూచనలు ఇచ్చారు. అలాగే పరిసరాల పరిశుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్లాల దేవస్థానం పునః నిర్మాణమునకు విరాళాల వెల్లువ

**రాజుపాలెం, నవంబర్ 01, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గల మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పునః నిర్మాణమునకు శనివారం భక్తులు విరాళాలను దేవాదాయ శాఖ వారికి అందించారు. 6 మంది భక్తులు రూ. 190788 లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి మరియు దేవాదాయ శాఖ అధికారులకు అందించడం జరిగినది. జలదుర్గం గ్రామానికి చెందిన నీలం నారాయణ అనే భక్తుడు వారి కుటుంబ సమేతంగా స్వామివారికి ఒక లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ప్రొద్దుటూరుకు చెందిన జింక సంజీవ రూ.25,555/లు, సానే సంజీవరాయుడు రూ 20116/ లు, ఉప్పలపాడుకు చెందిన మాయలూరు సహజ ఆనంద రెడ్డి రూ. 20001/లు, చౌదూరుకు చెందిన పల్లా రామాంజనేయరెడ్డి రూ.15116/ లు, మరిపల్లెకు చెందిన పంజాగాల సంజీవ రాయుడు రూ. 10000/లు వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి విరాళాలను అందించి ఆలయ అభివృద్ధికి సహకరించారు. వారికి దేవాదాయ శాఖ తరపున ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కాలంలో స్వామివారిని దర్శించుకొని శ్రీ సంజీవరాయ స్వామి ఆలయ నిర్మాణం చాలా గొప్పగా జరుగుతున్నందున, దాంతోపాటు మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ పునః నిర్మాణం కూడా చాలా గొప్పగా జరగాలని భక్తులు వారి సహాయ సహకారాలు విరాళాల రూపంలో చాలామంది భక్తులు అందిస్తూ వారి భక్తిని చాటుకొంటున్నారు. ఈ కార్యక్రమంలో యన్నం రాంభూపాల్ రెడ్డి, అశోక్ మహారాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నాసిరకంగా తారు రోడ్డు పనులు - ఏడు నెలలకే ఘోరంగా పగుళ్లు

**చిట్వేలి, నవంబర్ 01, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ద్వారా లక్షల రూపాయల ఖర్చు చేసి తారు రోడ్డు పనులు చేపట్టారు. కాని అవి నాసిరకంగా చేపట్టడంతో ఏడు నెలల వ్యవధిలోనే నెర్రెలు చీలి, గుంతలు ఏర్పడ్డాయి. ఐదు సంవత్సరాల వ్యవధి వరకు తమదే బాధ్యత అంటూ చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం నెలల వ్యవధిలోనే పతనం కావడం పట్ల మండల పరిధిలోని రామాపురం గ్రామస్తులు సంబంధిత గుత్తేదారుని నాసిరకం పనులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టేటప్పుడు అన్ని దశలను పరిశీలించి, పటిష్టంగా పనులు పూర్తి చేయించవలసిన అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ గతి పట్టిందని దుయ్యబడుతున్నారు. వివరాలలోకి వెళితే చిట్వేలి మండలం మూగవారిపల్లి రోడ్డు నుంచి మాలేమాపురం రామాపురం మీదుగా గరుగుపల్లి వరకు గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో గడిచిన ఏడాది మార్చిలో రోడ్డు నిర్మాణం చేపట్టి, ఈ ఏడాది మార్చికి పూర్తి చేసింది. కాగా రోడ్డు నిర్మాణంలో పాటించవలసిన గ్రావెల్ దశలను పాటించలేదని, రోలర్‌తో త్రొక్కించలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మాణంలో గుత్తేదారుడు నిరక్ష్యంగా వ్యవహరించాడని, ఎక్కువ రోజులు లావుపాటి కంకరను రోడ్డుపై ఏర్పాటు చేసి పనిని వాయిదా వేయడంతో కంకర వాహనాల రాకపోకలతో చల్లా చేదురుగా మారిందని, దానిని తిరిగి సరిచేసి రోలర్ యంత్రంచే గట్టిపరిచి తారునిర్మానం చేపట్టవలసి ఉండగా గుత్తేదారుడు నామమాత్రంగా ఉబ్బిడి దబ్బిడిగా రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. కొద్దిపాటి వర్షాలకే రోడ్డు నాణ్యత బయటపడిందని జిల్లా యంత్రాంగం దృష్టి సారించి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

**నాసిరకం పనులే ఈ దుస్థితికి కారణం:**

తొందరపాటుతో పాటు నాసిరకంగా పనులు చేపట్టడమే రోడ్డు పగుళ్లకు కారణమయ్యాయి. వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ముందు వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పక్కకు దిగితే తారు రోడ్డు పూర్తిగా కృంగిపోతూ ఉంది. మా ఊరికి తారు రోడ్డు వచ్చిందన్న ఆనందం కొద్ది నెలల కూడా నిలువలేదు.అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తగు న్యాయం చేయాలి.

\- చెవ్వు శివారెడ్డి (రామాపురం నివాసి)

**పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణం:**

దశలవారీగా నిర్మాణంలో పాటించవలసిన పనులను పర్యవేక్షించి ప్రజాధనానికి న్యాయం చేయవలసిన పర్యవేక్షణ అధికారుల లోపమే ఈ నాసిరకం నిర్మాణానికి ముమ్మాటికి కారణం. ఏడు నెలల వ్యవధిలోనే లక్షలు ఖర్చు చేసి చేసిన పనులు ఇలా కావడం బాధాకరంగా ఉంది. జిల్లా యంత్రాంగం పర్యవేక్షించి తగు చర్యలు చేపట్టాలి.



## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ..



**సుండుపల్లి,నవంబర్ 01, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలను ఆదుకోవడానికి ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా కార్యక్రమంలో సుండుపల్లె మండల అధ్యక్షుడు కళ్ళే రెడ్డప్ప, మండల క్లస్టర్ ఎల్వి రమణ పాల్గొన్నారు.మండల పరిధిలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాచిరెడ్డి గారిపల్లి గ్రామ అధ్యక్షులు బుక్కే.రమణ నాయక్, ఎస్.సి.సెల్ అధ్యక్షులు దప్పేపల్లి చంద్రమోళి, టీడీపీ సీనియర్ నాయకులు సి.వి రమణ బూత్ కన్వీనర్ జయచంద్ర నాయక్, కంబాల ప్రవీణ్, దప్పేపల్లి సువర్ణ రత్నకుమారి, వినుట్ ఇంచార్జ్ కంబాల సుధాకర, సి. రవీంద్ర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**సుండుపల్లి,నవంబర్ 01, ప్రభాతవార్త :**



టౌన్‌లో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి శ్రేణులతో కలిసి జనసేన నేత రామ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ శ్రీనివాస్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని నగదును లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల పింఛన్లను వితంతువుల పింఛన్లు మరియు వృద్ధాప్య పింఛన్ల పంపిణీ స్వయంగా పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి వద్దకే పెన్షన్లు అందుతాయని, ఏ రోజు పింఛన్లు అందుతాయో, ఎన్ని గంటల సమయంలో అందుతాయో, వంటి విషయాలను నేరుగా లబ్ధిదారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు యస్ వి రమణ గౌడ,మాజీ గ్రామపంచాయతీ అధ్యక్షులు సి వెంకటరమణ, తెలుగుదేశం మైనార్టీ సీనియర్ నేత మేకల మహబూబ్ భాష, బీసీ మండల అధ్యక్షులు గంతల చెన్నకృష్ణ, షైక్ మాభాష, పెద్దప్ప, శంకరయ్య,నవీన్, భాస్కర్, ప్రతాప్ తదితర జనసేన, తెలుగుదేశం, బీజేపీ శ్రేణులు కూటమి నేతలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీల్లో అన్నమాచార్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపకులపతి సాయిబాబా రెడ్డి

**రాజంపేట, నవంబర్1 ప్రభాతవార్త**
సైనాప్స్ 2కె25హ్యాకథాన్‌లో మెరిసిన అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు తిరుపతి మోహన్ బాబు యూనివర్శిటీ లో జరిగిన జాతీయస్థాయి సైనాప్స్ 2కె25హ్యాకథాన్‌లో అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి విశిష్ట స్థానం సంపాదించారు.దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి అనేక బృందాలు పాల్గొన్న ఈ జాతీయ స్థాయి సాంకేతిక పోటీలో ఖి ఎల్ఎంఎస్ ప్లాట్‌ఫారమ్ విత్ కంపెనీ కన్‌స్ట్రెయింట్స్ ఖి అనే అంశంపై వినూత్న పరిష్కారాన్ని రూపొందించిన అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థుల బృందం టాప్ 10 జట్లలో స్థానం పొందారు.సి.వి. జగదీశ్వర్ ఏ.సి.వి. విష్ణు వర్ధన్ రెడ్డి ఎం.వి. రవితేజ కె. సార్థక్ రాయ్‌లు టాప్ 7 ఫైనలిస్టులుగా ఎంపికై, సర్టిఫికేట్లు, ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని పొందారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డా. ఈ. సాయి బాబా రెడ్డి, డా. పి. ఫణీంద్ర కుమార్ రెడ్డి, విద్యార్థులను అభినందించారు.విద్యార్థుల కృషి, సృజనాత్మకత, బృందసమన్వయం ప్రశంసనీయం అని పేర్కొంటూ, ఇలాంటి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

## 94శాతం పెన్షన్లు పంపిణీ

**దువ్వూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం 94 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. మిగతా 6శాతం పింఛన్లను 3వ తేది సోమవారం నాడు పంపిణీ చేస్తారని తెలిపారు. పింఛన్ తీసుకొని వారు 3వ తేదీ సచివాలయాల వద్దకు వెళ్లి తమ పింఛన్ డబ్బులను పొందాలని తెలిపారు.

## 18 మంది జూదరులు అరెస్టు

**దువ్వూరు, నవంబరు 01, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రెండు గ్రామాల్లో జూదం ఆడుతున్న 18 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 7060 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ట్రైనింగ్ ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని చిన్నసింగన పల్లె గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న 7 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 2900 రూపాయలు, అలాగే గుడిపాడు లో 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 3160 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ముదివేడు ఎస్సైగా మధు రామచంద్రుడు

**కురబలకోట, నవంబర్ 1ప్రభాతవార్త**
కురుబలకోట మండలం ముదివేడు ఎస్సైగా మధు రామచంద్రుడు శనివారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతలు, అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి వంటి వాటిపై ఉక్కు పాదం మోపుతానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక పోలీస్ సిబ్బంది ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన..

**కడప కార్పొరేషన్ నవంబర్ 1 ప్రభాతవార్త:**



ప్రభుత్వం అన్యాయంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తుందని, పేద విద్యార్థులకు చదువు దూరం చేస్తుందని 28వ డివిజన్ కార్పొరేటర్ ఎస్. ఆరీపుల్లా బాష విమర్శించారు. శనివారం కడప శారదా నిలయం స్కూల్ వద్ద 28 వ డివిజన్ కార్పొరేటర్ ఎస్. ఆరీఫుల్లా బాష ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష, నార్త్ జోన్ మండల అధ్యక్షుడు ఇలియాస్ బి.హెచ్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్ బాష మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో 28 వ డివిజన్ పరిశీలకులు నందలూరు ఫ యాజ్, ఇబ్రహీం మియా, నార్త్ జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అమీరు ల్లా(ముస సెట్), కె. జబీర్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివ,మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సుజిత, సెక్రటరీ శ్వేత రెడ్డి, మాజీ కౌన్సిలర్ స్వర్ణ కుమారి, నగర మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్ సలీం, రాజా, సోషల్ మీడియా వైస్ ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్. గౌస్పీర్, గౌస్పీర్, రౌఫ్, భీమా బాబు, భీమా గయాస్, ఫరూక్, వాణిజ్య విభాగం అధ్యక్షులు ఫయాస్ బాషా పాల్గొన్నారు.

## నిరుపేదలు ఇబ్బందులు పడతారు : మాజీ ఎమ్మెల్యే



**బ్రహ్మంగారిమఠం, నవంబర్ 01 ప్రభాతవార్త**
మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయొద్దంటూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి మాట్లాడుతూ గత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరుపేదల పక్షాన నిలిచిందన్నారు. ఇందులో భాగంగానే విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన ఘనత ఒక జగన్ మోహన్ రెడ్డి కే దక్కిందన్నారు. అటువంటి మెడికల్ కాలేజీలు కొన్ని ప్రారంభ దశలో కొన్ని ప్రారంభమయ్యాయని మరి కొన్ని నిర్మాణ దశలో ఉండగా వాటిని ప్రైవేట్ పరం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తర్వాత చూపడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అభివృద్ధి ఆయన చేయడు చేసిన వారిని మెచ్చుకోరు ఇది ఆయన నైజం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేకల రత్న కుమార్ యాదవ్, బి.మఠం మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజుల రామయ్య, యల్లటూరు శివారెడ్డి, యువజన విభాగం మండల నాయకుడు పసుపులేటి వెంకటేష్, భూమిరెడ్డి బాలకృష్ణ, భాస్కర్ రెడ్డి, ఉమాపతి, జోగయ్య, గురుమూర్తి, దుగ్గిరెడ్డి, సోమయ్య, శంకర్ రెడ్డి, సర్పంచులు రాయపు రెడ్డి లక్ష్మీదేవి, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు వినతిపత్రం

**కడప కార్పొరేషన్ నవంబర్ 1 ప్రభాతవార్త:**



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుని బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి శనివారం కడపలో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. బేడా బుడగ జంగం కులాన్ని ఎస్సీ లుగా ఆమోధించి మాకు కులాధ్రువీకరణ పత్రాలు వచ్చే లాగా చూడాలని పస్తం అంజి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పస్తం అంజి మాట్లాడుతూ ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిలు బేడా బుడగ జంగం వారికీ క్యాస్ట్ సరిటిఫికెట్స్ ఇవ్వడం కోసంమై రాష్ట్ర క్యాబినెట్ లో ఆమోదించి తీర్మానించారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బేడా బుడగ జంగం కులము వారిని ఎస్సి జబితాలో చేర్చి ఎస్సి వర్గీకరణలో ఏ కేటగిరి క్రింద చేర్చి సీఎం చంద్రబాబు కేంద్రానికి నివేదిక ఇచ్చారని చెప్పారు. బేడ బుడగ జంగం వర్గాల వారినీ ఎస్సీ జాబితాలో చేర్చడం కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళ్లాలి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు విజ్ఞప్తి చేశామన్నారు. కారిక్రమంలో కె.లక్ష్మయ్య, వెంకటేష్, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

**పీలేరు నవంబర్ 1 ప్రభాతవార్త:**
పీలేరు మండలం, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటిపర్తి గంగాధరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19 నుండి డిసెంబర్ 15 వరకు నిరవధిక నిరాహార దీక్ష చేసి అమరుడైయ్యాడని, 1953లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని, 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఈ సంఘం ఒక నివేదికను తయారుచేసి 1956లో పార్లమెంట్ కు సమర్పించడం జరిగాక ఆ నివేదిక ఆధారంగా1956 నవంబర్ 1న భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయడం జరిగిందని, భారతదేశంలో మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆనంద్ రాజు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్ర ఏర్పాటుకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, రామమూర్తి ,అశోక్ కుమార్, ఫారూఖ్, సురేంద్రనాథ్, విద్యార్థులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



**మైదుకూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**
అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ను పురస్కరించుకొని మైదుకూరు స్థానిక మార్కెట్ కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టిరామమోహన్,ఈ సందర్భం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార 1952 అక్టోబర్ 19న ప్రారంభించి డిసెంబర్ 15, 1952న ఆయన మరణంతో ముగిసి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు దారితీసింది అని ఆ తర్వాత 1956 నవంబర్ 1 ఆంధ్రప్రదేశ్ అవతరణ ఏర్పడింది అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్. మైదుకూరు హెడ్మాస్టర్ ఇలియాస్ అహమ్మద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం గా తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని ఆయన త్యాగం నేటి తరానికి స్ఫూర్తి కావాలన్నారు. ఎస్ టి యు మండల ఆర్థిక కార్యదర్శి విజయ్ నరసింహ రాజు, ఎస్ టి యు సీనియర్ నాయకులు దరిశ శ్రీనివాసులు, అందే బాలగంగాధర్ రావు, రాధా నరసింహరాజు , కె.ఆనంద రావు, గుండా పద్మనాభయ్య,మూడే సురేంద్రనాయక్,బాబు తదితరులు పాల్గొన్నారు.

## యనమల సుధాకర్ ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ

**పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త:**



పట్టణ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛను సచివాలయ సిబ్బంది ద్వారా శనివారం వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మేజర్ పంచాయతీ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో పింఛన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్వేసు, షరీఫ్ లు పాల్గొన్నారు.

## అమరావతి మాక్ అసెంబ్లీకి ముగ్గురు ఆణిముత్యాలు

**తంబళ్లపల్లె నవంబర్ 1 ప్రభాతవార్త ః**
రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26న మన రాష్ట్రరాజధాని అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీలో తంబళ్లపల్లె నియోజకవర్గం నుండి క్రీడల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారని ఎంఈఓలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్లు తెలిపారు. పీటీఎం మండలం రంగసముద్రం జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థి డి పవన్ సాయి (ప్రథమ) తంబళ్లపల్లె మోడల్ స్కూల్ టెన్త్ విద్యార్థిని ఎస్ సుహానా (ద్వితీయ) బీ కొత్తకోట జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థి జె అనిల్ కుమార్ (తృతీయ) స్థానాలు పొందారు.

## మన మిత్ర సేవలపై అవగాహన



**వేంపల్లె :నవంబర్ 01:(ప్రభాత వార్త)**
దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మన మిత్ర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ట్రిపుల్ ఐటీ ఏఓ డా.రవికుమార్ అన్నారు. శనివారం ఇడుపులపాయలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతి ఇంటింటికీ వెళ్లి వీటి ఉపయోగం, ప్రయోజనాలను వివరించారు. మన మిత్ర ద్వారా దాదాపు 254 సేవలను పొందవచ్చని, అలాగే ఇంటి నుంచే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తిపన్ను, విద్యుత్ బిల్లులు, హాల్ టికెట్ లు, ఫలితాలను ఫోన్ ద్వారా పొందే అవకాశం ఉందని డా.రవికుమార్ వెల్లడించారు. భువన్ టూడి ద్వారా రైతులకు సంబంధించిన సర్వే నెంబర్ లు, సరిహద్దులు, మీ భూమి పోర్టల్ ద్వారా భూ వివాదాలు, భూ హక్కులు, అడంగల్ తదితర వాటిపై సమాచారం తెలుసుకోవచ్చున్నారు. డిజిటల్ పేమెంట్, ఆన్లైన్ మోసాలు గురి కాకుండా ప్రజలకు విద్యా వాలంటీర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జె.దీప్తి, అధికారులు డా.కోనప్ప, డా.రత్నకుమారి, డా.తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం..

**వేంపల్లె:నవంబర్ 01:(ప్రభాత వార్త)**



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అని కాంగ్రెస్ రాష్ట్రనేత డా.తులసిరెడ్డి అన్నారు. శత్రువుల ఇళ్లలోకి చొరబడి కొడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ వలసదారుల పేరుతో కొన్ని వందల మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం చేతులకు సంకెళ్ళు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి సైనిక విమానంలో 24 గంటల పాటు పశువుల కంటే హీనంగా రవాణా చేసినప్పుడు ఈ ప్రగల్భాలు ఏమయ్యాయని తులసిరెడ్డి ప్రశ్నించారు. మెక్సికో, కొలంబియా దేశాలు నిరసన తెలిపాయని, కొన్ని దేశాలు తమ విమానాలు పంపించి తమ దేశ పౌరులను గౌరవప్రదంగా తీసుకువచ్చాయని తెలిపారు. కానీ మోడీ ప్రభుత్వం అమెరికా ప్రభుత్వానికి నిరసన కూడా తెలియజేయ లేదన్నారు. ఇప్పుడు మాత్రం ఉత్తర కుమార ప్రగల్భాలు పలకడం సిగ్గు చేటన్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి మిత్ర దేశమైన రష్యా నుంచి చమురు దిగుమతి నిలుపుదలను మోడీ ప్రభుత్వం చేసిందన్నారు. ఇంతకంటే పిరికిపంద చర్య మరొకటి ఉంటుందా? అన్నారు. నెహ్రూ, పటేల్ మధ్య విభేదాలు ఉన్నట్లు మోడీ పదేపదే మాట్లాడడం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ ని ప్రధాని చేసిందని, పటేల్ ని ఉప ప్రధాని, హోంమంత్రి చేసిందన్నారు. అయితే మోడీ గురువైన అద్వానీకి పంగనామం పెట్టలేదా? ప్రధాని, రాష్ట్రపతి పదవి ఎందుకు ఇవ్వలేదో తెలపాలని కోరారు. జమ్ము, కాశ్మీర్ విషయంలో నెహ్రూ, పటేల్ దార్శనికతతో అవి భారత్ లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మహాత్మాగాంధీ, ఇందిరా, రాజీవ్ దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వం కోసం ఆత్మబలిదానం చేశారన్నారు. అలాగే స్వాతంత్ర్య ఉద్యమానికి బిజెపికి సంబంధమే లేదన్నారు.

## ఏవో.. జోక్యంతో రద్దుయినా బాల్యవివాహం

**వేంపల్లి:నవంబర్ 01:(ప్రభాత వార్త)**



వేంపల్లి పంచాయతీ పరిధిలోనీ ఆదివారం జరగనున్న బాల్యవిహ్వానికి పంచాయతీ కార్యదర్శి నాగభూషణరెడ్డి కు వచ్చిన సమాచారం మేరకు అయన జోక్యం చేసుకొని ఆ బాల్యవివాహానికి రద్దు చేశారు. వేంపల్లి బూడిది గుంటకు చెందిన ఒక మైనర్ బాలికను చక్రాయిపేట చెందిన వారి దూరపు బంధువులకు ఇచ్చి వివాహం చేయించాలని ఇరువర్గాలు నిశ్చయించారు వివాహం కావలసిన అన్ని అన్ని సన్నాహాలు పూర్తిచేసుకుని ఉండగా సంబంధిత వ్యక్తులను పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి నాలుగు సంవత్సరాల తర్వాత వారి ఇరువురికి వివాహం జరిగేటట్లు అయన కౌన్సెలింగ్ ద్వారా ఆ వివాహన్ని నాలుగు సంవత్సరాలకు వాయిదా వేయించి పంపించారు. దీంతో అయన కు గ్రామస్థులు ప్రతేకంగా అభినందనలు తెలిపారు.

## హృదయపేట గ్రామంలో విధులను పరిశుభ్రం



**కలసపాడు, నవంబర్ 1 ప్రభాతవార్త**
మండలం లోని లింగారెడ్డి పల్లె గ్రామ పంచాయితీ హృదయపేట గ్రామం లోని ఎస్సి కాలనీ వీధులన్నీ కంపచట్లతో నిండిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకుడు బసిరెడ్డి జయరామిరెడ్డి సొంత నిధులతో శనివారం జెసిబి సహాయంతో వీధులను పరిశుభ్రం చేయించారు. అనంతరం స్మశానంలో ఉన్న కంప చెట్లను కూడా తొలగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఎటువంటి సమస్యలు ఉన్నా సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.. ఏవైనా ప్రజా సమస్యలు ఉంటే తమ దుష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడతానన్నారు.

## శ్రీనల్ల వీరగంగా భవాని విగ్రహప్రతిష్ట

**కలికిరి, నవంబరు 1, ప్రభాతవార్త:**
ఈ నెల 9వ తేదీ కలికిరి మండలం, పత్తేగడ గ్రామం కొటాల నందు వెలసిన శ్రీ నల్ల వీర గంగా భవానీ ఆలయం నందు శ్రీ నల్ల వీరగంగా భవానీ విగ్రహ ప్రతిష్ట ఉంటుందని వాసనూరి చంద్రశేఖర్, వాసనూరి శివశంకర్‌లు తెలిపారు. 7వ తేదీ సాయంత్రం శ్రీగణపతి పూజ, గంగా పూజ, గోపూజ తదితర పూజలతో పాటు మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని, 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రాతఃపూజ, విగ్ర మహాస్నపనం, శిఖర కలిశ ప్రతిష్ట, ధాన్యాదివాసం, మహా మంగళహారతి, ప్రసాత వినియోగం ఉంటుందన్నారు. సాయంత్రం సాయంపూజ, అగ్నిప్రతిష్ట, మహాసరస్వతి హోమం, వేదస్వతి, శయ్యాదివాసం, 9వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రాతఃపూజ, ప్రతిష్టాహోమం, 9గంటల నుంచి విగ్రహ ప్రాణప్రతిష్ట, బింబ కళాన్యాసం, శ్రీ గణపతి రుద్ర అమ్మవారికి మూలమంత్ర హోమం, పంచామృతాభిషేకం, అర్చన తీర్థ ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు భక్తాదులు వచ్చి తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## 18వ వార్డులో ఎమ్మెల్యేచే పింఛన్లు పంపిణీ



స్టోర్ లోని సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లి నవంబర్ 1 ప్రభాత వార్త**
పట్టణంలోని మున్సిపల్ 18వ వార్డులో శనివారం ఎమ్మెల్యే షాజహాన్ భాష పింఛన్లు పంపిణీ చేశారు. ఈ పింఛన్లు పంపిణీ కార్యక్రమం వార్డు ఇంచార్జ్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదన్నర పాలనలో ప్రతినెల 1న పెన్షన్ల రూపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా స్టోర్ నెంబర్ 14న సైదాపేటలో నూతనంగా ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఎమ్మెల్యే చే నిత్యవసర సరుకులు పంపిణీ చేయించారు. 18 వ వార్డుకు వాటర్ ప్లాంట్ ను మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల టిడిపి నాయకులు నవీన్ చౌదరి, పార్టీ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.



**బద్వేలు, నవంబర్ 1, ప్రభాతవార్త**
కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతిఘటిద్దాం, సమానత్వం సౌభ్రాతత్వం ప్రజాస్వామ్యం వర్ధిల్లె ప్రజల ఆంధ్రప్రదేశ్‌నీ నిర్మిద్దామని, అలాగే డిసెంబర్ 6, 7వ తేదీలలో కడప నగరంలో జరుగుతున్న 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం గోపవరం మండలం సంద్రపల్లె, రాచాయపేట, రామాపురం తదితర ప్రాంతాలలో కరపత్రాలు విడుదల చేసి పంచడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి సంపద సృష్టి సంక్షేమం తెస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన డబల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రస్తుతం సంపదను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నారని ప్రజాసంపదైన లాభాలలో నడుస్తున్న వివిధ రకాల ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పచెప్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ గంగవరం పోర్టు మత్సకారులపై కాల్పులు జరిపి మరి ఆదాని కంపెనీకి అప్పజెప్పాలని ,బారైట్స్ గనులను జిందాల్ కంపెనీకి కడప గనులను మిట్టల్ కంపెనీకి అప్ప చెప్తున్నారు. అధికారం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ గా మిగిలిపోయిందని, మనువాద శక్తులను దన్నుగా ప్రోత్సహిస్తూ అధికార మార్గమే కార్యక్రమం చేపడుతుందని మనువాద భావాజాలంతో యువత భవితమవుతున్నారని , మహిళలపై అత్యాచారాలు షెడ్యూల్ కులాలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. 6 తేదీ జరగబోవు ర్యాలీ బహిరంగ సభలో వందలాదిమంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు బాబు, చంద్రపాల్, గోపవరం కమిటీ నాయకులు భాష, రంతు, సుబ్బయ్య, చెన్నయ్య, కన్నమ్మ, గురు స్వామి, మహమ్మద్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించండి



**పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త:**
పట్టణంలో ప్రెస్ క్లబ్ కోసం స్థలం కేటాయించాలని శనివారం హ్యూమన్ రైట్స్ ముత్యాల ప్రసాద రావు శనివారం ఆర్డీవో చంద్రమోహన్ ను బద్వేల్ లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. పట్టణంలో దాదాపు 40 మంది వరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వున్నారని, పట్టణం కూడా రోజు రోజుకు వేగంగా అభివృద్ధి చెందుతోందని, అయినప్పటికీ ఇంతవరకు విలేకరులకు ప్రెస్ క్లబ్ లేదని అన్నారు. జర్నలిస్టులు ఏవైనా వృత్తి పరమైన సమావేశాలు నిర్వహించుకోవాలన్నా, ప్రజలు ప్రెస్ మీట్లు పెట్టుకోవాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆర్డిఓ కు తెలిపారు. వెంటనే స్పందించిన ఆర్డీవో చంద్రమోహన్ పోరుమామిళ్ల తహసీల్దార్ కు విషయం తెలియచేశారు. సాధ్యమైనంత త్వరలో ప్రెస్ క్లబ్ కు స్థలం ఏర్పాటు చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

## దిగుబడి వస్తే క్వింటాల్ కు 6వేలు...

### లేకపోతే ఎకరాకు 50 వేలు.. క్రాసింగ్ పంటల సాగు తీరు

**దువ్వూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:**
మండల పరిధిలో క్రాసింగ్ పంటలైన జొన్న, మొక్కజొన్న, సొద్ద వంటి పంటలు సాగు చేసేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, ఏజెంట్లు రైతులను మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువ కావడంతో రైతులు క్రాసింగ్ పంటలు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కంపెనీల ఆర్గనైజర్లు, ఏజెంట్లు తమ క్రాసింగ్ పంటలు సాగు చేయాలని కోరుతూ రైతులను అనేక విధాలుగా మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రాసింగ్ జొన్న పంట సాగు చేస్తే మంచిగా దిగుబడి వస్తే క్వింటాల్ కు 6వేల రూపాయలు ఇస్తామని, ఎకరాకు 15 క్వింటాళ్లు వస్తుందని, 90 వేల రూపాయలు చేతికి వస్తుందని చెబుతున్నారు. అలాగే ఒకవేళ పంట దిగుబడి రాకపోతే నష్ట పోతే రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు చెల్లిస్తామని చెబుతున్నారు. ఇవన్నీ కేవలం మాటల మీదనే జరుగుతున్నాయి. ఎటువంటి అగ్రిమెంట్లు, ఒప్పందాలు జరగడం లేదు. దీంతో రైతులు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. గతంలో జొన్న, మొక్కజొన్న వంటి క్రాసింగ్ పంటలు సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. గత ఏడాది రబి సీజన్లో మొక్కజొన్న సాగు చేసి ఉంటే ఎకరాకు కేవలం 2, 3 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో పెద్ద ఎత్తున క్రాసింగ్ పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చేయడంతో వివిధ రకాల క్రాసింగ్ కంపెనీలు ముందుకు వచ్చి 40 నుంచి 45వేల రూపాయలు చెల్లించారు. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులను వివిధ రకాలుగా మభ్యపెట్టి క్రాసింగ్ పంటలు సాగు చేసేందుకు ఆర్గనైజర్లు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఒక గ్రామంలో రైతులకు విత్తనాలు అందజేయాలంటే అందజేసే వ్యాపారికి కానీ, ఏజెంట్ కు కానీ విత్తన లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇక్కడ క్రాసింగ్ విత్తనాలు అందజేస్తున్న ఏజెంట్లకు ఎటువంటి లైసెన్సులు లేవు. వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. గత ఏడాది సుమారు 3వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న వంటి క్రాసింగ్ పంటలు సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కంపెనీలు నామమాత్రంగా చెల్లించిన, కొన్ని కంపెనీలు రైతులను పట్టించుకోలేదు. ఈ ఏడాది కూడా పంటలు సాగు చేసేందుకు ఏజెంట్ లు, ఆర్గనైజర్లు ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్న సాగుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా రైతులు క్రాసింగ్ పంటల ఆర్గనైజర్ల, ఏజెంట్ల మాటలు విని మోసపోకుండా ఒప్పంద పత్రాలు తీసుకొని, అగ్రిమెంట్ చేసుకుని క్రాసింగ్ పంటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

## పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం



సిద్ధవటం నవంబర్ 1 ప్రభాతవార్త

పోలీసుల పోలీస్ సేవలు చిరస్మరణీయమని బెటాలియన్ కమాండెంట్ కే ఆనంద్ రెడ్డి అన్నారు. 11వ పోలీస్ బెటాలియన్ పోలీస్ అమరవీరుల వారోత్స వాలు భాగంగా క్యాండిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించడమైనది కమాండెంట్ కె ఆనంద రెడ్డి మరియు సహచర ఉద్యోగులతో కలిసి క్యాండిల్ ర్యాలీ కార్యక్రమంలో భాకరాపేట శివారు నందు ప్రారంభించి భాకరాపేట నందుగల సర్కిల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీతో అమరవీరుల యొక్క పేర్లను నినాదాలు చేస్తూ పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో డి ఎస్పి అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

## సిహెచ్‌సిలో సిజరిన్ ప్రసవాలు చేసుకోవచ్చు

### అధునాతన వైద్యం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లి; నవంబర్ 01, ప్రభాతవార్త



ప్రసవం చేసిన గైనకాలజిస్ట్ దేవి ప్రశాంతి

లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆసుపత్రిలో ఇంత వరకు గైనకాలజిస్ట్ లేక పోవడంతో గర్భిణీలను వేరే ఆస్పత్రికి రెపరె చేసే వారమని ప్రస్తుతం గైనకాలజిస్ట్ అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకోవచ్చుని ఆసుపత్రి సూపరింటెంట్ సులోచన తెలిపారు. శనివారం కమ్యూనిటీ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ ప్రసవం చేశారు. ఇక మీదట ఏ ప్రభుత్వ ఆసుపత్రులకు దూర ప్రాంతాలకు వెళ్లినవసరం లేదని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని సిజరిన్ ప్రసవాలు సురక్షితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రి నందు చిన్న పిల్లల డాక్టర్లు, డెంటల్ డాక్టర్ అందుబాటులో ఉన్నార న్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె డిప్యూటీ ఎంపీడీవోగా ఎంవి ప్రసాద్

తంబళ్లపల్లె నవంబర్ 1 ప్రభాతవార్త ః



మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా ఎం.వి ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం జిల్లా గుత్తి నియోజకవర్గం కరిడికొండ గ్రేడ్ వన్ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై తంబళ్లపల్లె డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్‌ను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కార్యాలయ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## టిడిపి నాయకుల పెన్షన్లు పంపిణీ

తంబళ్లపల్లె నవంబర్ 1 ప్రభాతవార్త ః



మండలంలోని ఎద్దులవారిపల్లి పంచాయతీలో టిడిపి సీనియర్ గ్రామ కమిటీ నేత రమణ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. అవినీతి వైకాపా పాలనలో అప్పుల పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దేశానికి ఆదర్శమని ఆయన కొనియాడారు. అదేవిధంగా మండలంలోని కోసువారిపల్లి, బాలిరెడ్డిగారిపల్లి, తంబళ్లపల్లె, చెలూరి వాండ్లపల్లి, గుండ్లపల్లి, రేణుమాకులపల్లి, కోటకొండ, అన్నగారి పల్లి, కన్నెమడుగులో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ముద్దలదొడ్డి వెంకటరెడ్డి, పురుషోత్తం, రామలింగారెడ్డి,నరసింహులు, సామిరెడ్డి, కాలా నారాయణ, యువ గళం బాలాజీ, కన్నె మడుగు సురేంద్ర, చిన్న రెడ్డప్ప నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పిచ్చి కుక్కల స్వైర విహారం

తంబళ్లపల్లె నవంబర్ 1 ప్రభాతవార్త ః

మండల కేంద్రంలో ఎక్కడ చూసినా శునకాలు స్వైర విహారం చేసి పలువురు మనుషులతో పాటు పశువులను గాయపరుస్తున్నాయి. కొన్ని సునకాలకు పిచ్చి పట్టడంతో స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వందల సంఖ్యలో శునకాల స్వైర విహారంతో ప్రజలు తమ పిల్లలను స్కూళ్లకు పంపించడానికి ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శునకాల బారి నుండి విముక్తి చేయాలని కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మదనపల్లి నవంబర్ 1 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు మదనపల్లికి చెందిన దీక్షా స్కూల్ విద్యార్థి వై.వెంకట విశ్వ సాయి ఎంపికైనట్లు స్కూల్ యాజమాన్యం తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్ కొత్త మంచూరు నందు జరిగినటు వంటి జిల్లా నెట్ బాల్ సెలక్షన్స్ నందు మదనపల్లి దీక్ష స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతికి చెందిన వై. వెంకట విశ్వ సాయి రాష్ట్ర స్థాయి అండర్ 17 నెట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు శివప్రసాద్, వరలక్ష్మి అభినందించారు.

## శరవేగంగా కోటి సంతకాల సేకరణ



తొండూరు నవంబర్ 01 ప్రభాతవార్త :

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైఎస్సార్సీపి చేపట్టిన ప్రజా ఉద్యమం ఊపొందుకుంది. వైకాపా మండల అధ్యక్షుడు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, వైఎస్ఆర్సీపి జిల్లా ఉపాధ్యక్షుడు డివి శశికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బోడివారిపల్లె గ్రామంలో కోటి సంతకాల సేకరణ శరవేగంగా సాగుతుంది. గత ప్రభుత్వంలో వైయస్ జగన్ జిల్లాకు ఒకటి చొప్పున 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం ఈ 17 నెలల పాలనలో వాటిని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. వైద్య విద్యను వ్యాపారం చేయొద్దని, ఇది కేవలం సంతకం కాదు కోటి గుండెల నిరసన అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాలుకా ప్రధాన కార్యదర్శి యాడికి ధశరధ రామిరెడ్డి అంకిరెడ్డి సురేష్ రెడ్డి (చంటి) సర్పంచ్ మార్తల గురుమోహన్‌రెడ్డి, కొప్పల బంగారు మునెయ్య, జింకా అశ్వనికుమార్ నాదెండ్ల దస్తగిరి పాల్గొన్నారు.

## డిసెంబర్ మాసంలో మాదిగల మహోత్సవ సభ,

మైదుకూరు, నవంబర్ 01, ప్రభాతవార్త:

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పోగు వెంకటేశ్వరరావును శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటరమణ కలిసి డిసెంబర్ మాసంలో జరిగే మాదిగల మహోత్సవ సభ గురించి చర్చించి గోడపత్రాలను విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గంగిపోగు శ్రీనివాసులు జిల్లా అధ్యక్షులు తప్పెట శివ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సంఘటితంగా ఉంటేనే సంక్షేమం సాధ్యం



సమావేశమైన నాయకులు

మదనపల్లి నవంబర్ 1 ప్రభాతవార్త

సంఘటితంగా ఉంటేనే బంజారాల అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు నాగు నాయక్ తెలిపారు. శనివారం పుంగనూరు మండలంలో నాగు నాయక్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బి చక్రినాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె రాంబాబు నాయక్ హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి నాగు నాయక్, పుంగనూరుకు చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు మీసేవ నాగరాజు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి శంకర్ నాయక్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఎం మనోజ్ కుమార్ నాయక్, జిల్లా ట్రెజరర్ రవీంద్రనాయక్‌ల నిర్వహణలో, పుంగునూరు మండలంలో బంజారా తాండాలలో జాతి అభివృద్ధికి క్రియా శీలకంగా సేవలు అందిస్తూ అండగా నిలచే వారిని గుర్తించి మండల కమిటీలో నియమించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు నాగు నాయక్ తెలిపారు. అదే విధంగా జిల్లా మహిళా అధ్యక్షురాలుగా రత్నమ్మను, మహిళా విభాగం సభ్యులుగా శంకరమ్మ, శైలజ, కళావతిను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అభివృద్ధికి దూరంగా ఉన్న బంజారాలను చైతన్యపరచి సమాజంలో భాగస్వాములు చేయడమే తమ ప్రధాన ఎజెండా అన్నారు. అన్ని విభాగాల లోను కొత్త కమిటీలను ఏర్పాటు చేసి హక్కుల సాధన కోసం ముందుకు సాగుదామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు మండలం లోని బంజారా గ్రామ పెద్దలు, హీరానాయక్, బి దేశనాయక్, బి నరసింహులు నాయక్, ఎం నాగరాజు నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయండి



మదనపల్లెక్రైమ్, నవంబర్ 1 ప్రభాతవార్త.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే సెంటర్లలో అన్ని మౌలిక సదుపాయాలు, వసతులు ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కొండూరు శ్రీనివాసరాజు సూచించారు. శనివారం ఆయన మదనపల్లె లోని పదోతరగతి పరీక్షాకేంద్రాలైన జడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ మున్సిపల్ హై స్కూల్, బాలికల ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ హైస్కూల్ తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రాజు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు మార్చి 2026లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం ఫ్యాన్లు, తాగునీటి వసతి తదితర అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. మదనపల్లె పట్టణంలో 18 పరీక్షా కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి, డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ రవి, పఠాన్ మహమ్మద్ ఖాన్, సుబ్బారెడ్డి, షాజహాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలు

తంబళ్లపల్లె నవంబర్ 1 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం చేలూరి వాండ్లపల్లి పంచాయతీ కురవపల్లికి చెందిన విద్యార్థులు ఆటోలో తంబళ్లపల్లెకు సమీపంలోని మోడల్ స్కూలుకు వెళుతుండగా చిన్నేరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో ఆటో డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదు మంది పిల్లలకు గాయాలు కాగా తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు చేయించారు. ఎంఈఓ త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్లు విద్యార్థులను పరామర్శించారు.

## రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌కు అంతరాయం

తొండూరు నవంబర్ 1 ప్రభాతవార్త :

తొండూరు మండలంలోని మల్లెల, తొండూరు గ్రామంలో ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి 11:00గంటల వరకు 33కెవి రోడ్డు విస్తరణలో కారణంగా 33/11రేజు మల్లెల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. అదేవిధంగా తొండూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి తొండూరు టౌన్ ఫీడర్ మల్లెల వ్యవసాయ ఫీడర్ ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 13:00గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ప్రజలు మరియు రైతులందరూ సహకరించాలని మండల ఏఈ బాల సంజీవులు ఓ ప్రకటనలో కోరారు.

## మాల మహానాడు అధ్యక్షుడిగా గూండా సతీష్

పీలేరు నవంబర్ 1 ప్రభాతవార్త:



నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

మదనపల్లి పట్టణంలో మాల మహానాడు కార్యాలయంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శన ఆధ్వర్యంలో గూండా సతీష్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జాతీయ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శన్ నియామక పత్రాన్ని సతీష్‌కు అందజేసినారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ నాకు ఈ స్థాయి కల్పించిన మాల మహానాడు అధికార ప్రతినిధి హరి, ఎన్‌టి రమణ, రాష్ట్ర నాయకులు పుంగనూరు అశోక్, అమల చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన, జిల్లా అధ్యక్షులు శివ, వీరభద్రయ్య, విజయ్ విశ్వనాథ్ అంకన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నా వంతు కష్టపడి పని చేస్తానని సంఘ నాయకులకు అందుబాటులో ఉంటూ కర్తవ్యాన్ని నెరవేరుస్తానన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కురబలకోట నవంబర్ 1 ప్రభాతవార్త

మండలంలో రాజ్యాంగ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ రాజ్యాంగ దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరిగాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం అంగళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంగళ్లులో శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి అధ్యక్షతన వ్యాసరచన వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా తంబళ్లపల్లి మండల విద్యాధికారి ఆర్ రెడ్డి శేఖర్, పిటీఎం మండల విద్యాధికారి1 ఎన్ నారాయణ కురబలకోట మండలం మండల విద్యాధికారి 2 ఎం శ్రీనివాసులు, తంబళ్లపల్లి మండల విద్యాధికారి 2 సిఆర్ నాగసుబ్బరాయుడు ఆరు మండలాల నుండి జిల్లాస్థాయి రాజ్యాంగ దినోత్సవం పోటీలకు ఎంపికయ్యారు. ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులను అభినందించారు.




## కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత - మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు, నవంబర్ 1(ప్రభాతవార్త):



మండలంలోని వెలిగల్లు, తూముకుంట గ్రామాల ప్రజలు, వైసీపీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన రచ్చబండ- కోటి సంతకాల సేకరణ కార్యక్రమాల్లో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కోటి సంతకాల ఉద్యమం, పేదల ఆరోగ్యహక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన మహాయజ్ఞం. ఈ ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి విస్తరించి,విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. కార్యకర్తలే పార్టీ స్తంభాలని మీ సమస్యల్లో ఎల్లవేళలా మీ పక్కనే ఉంటాని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తలు, ప్రజలతో ఆత్మీయంగా మమేకమైన ఆ యన, ప్రతి ఇంటిలోకి ఈ ఉద్యమం చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ ఉద్యమం రాజకీయ పోరాటం కాదు ప్రజల హక్కుల కోసం జరుగుతున్న సత్యాగ్రహం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్‌కె ఖాదర్‌మొహిద్దీన, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, విశ్వనాదరెడ్డి, ఆంజనేయరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధులపై అవగాహన



బద్వేల్ నవంబర్ 1, ప్రభాతవార్త

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల భావనారాయణ నగర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు డాక్టర్ వై శ్రీనివాసులు ఆధ్వర్యంలో కీటక జనత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత గురించి వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల నీళ్ల విరోచనాలను అరికట్టవచ్చున్నారు. ఆహారం తినక ముందు ఆహారం తిన్న తర్వాత కాళ్లు చేతులు శుభ్రపరచుకోవడం వల్ల వ్యాధులు బారి నుండి తప్పించుకోవచ్చున్నారు. ఇందులో భాగంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య మరియు ఏఎన్ఎం సి వి సుబ్బనరసమ్మ ఆశ జయమ్మ కుమారి ఉపాధ్యాయ బృందం బి శైలజ జి జనార్ధన్ జి గురవయ్య జి వెంకటేష్ జిసి నరసింహ పాల్గొన్నారు.

## కాశీబుగ్గ ఘటనపై సుగవాసి దిగ్భ్రాంతి

రాయచోటి అర్బన్, నవంబర్ 1, ప్రభాతవార్త



శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటన బాధాకరమన్నారు.

## లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం నవంబర్ 01 ప్రభాతవార్త:



మండలంలోని దేవగుడిపల్లి గ్రామం జల్లావాండ్లపల్లి వద్ద మాండవ్య నది వడ్డున వెలసిన మహిమాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహ స్వామికి ఏకాదశి శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకం చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు స్వామికి నైవేద్యం సమర్పించి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వాసులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



పీలేరు, నవంబర్ 1 ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, వాటిని పెంచడం చాలా అవసరమని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కార్తీక వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద రావు ఆదేశాల మేరకు, కె.వి.పల్లి మండలం, మారెళ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వెంకట సుబ్బులు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం రోజు రోజుకూ పెరుగుతూ, దాని ప్రభావంగా అతివృష్టి-అనావృష్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ పరిస్థితులు దేశ ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి మొక్కలు నాటే కార్యక్రమాలను తరచుగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు రేంజ్ బీటు అధికారులు జగదీష్, రెడ్డి ఆసియా బి, శ్రీనివాసులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరాజీవి పొట్టి శ్రీరాములకు ఆర్యవైశ్యుల నివాళి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 1 ప్రభాతవార్త

నవంబరు 1వతేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవ తరణ దినోత్సవ సందర్భముగా శనివారం అమ్మవారిశాల నుండి ఆర్యవైశ్యులు ర్యాలీగా బయలుదేరి లైటిపాలెం సెంటర్ లోగల అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహమునకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆర్యవైశ్యసభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ప్రసంగిస్తూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 1952 సరాలో 58 రోజుల పాటు మద్రాసు నగరంలో ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులు కావడం తదుపరి కేంద్ర ప్రభుత్వం 1953 అక్టోబర్ 1 వతేదిన ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేస్తూ ప్రకటించడం జరిగనదని, ఆనాటి త్యాగ ఫలితమే తెలుగు వారందరం కలిసి ఒక రాష్ట్రంలో జీవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు గారి ఆత్మశాంతికై 2 నిమిషాలు మౌనం పాటించారు. తదుపరి ప్రసంగిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెనుగొండ క్షేత్రమును "శ్రీ వాసవి పెనుగొండ క్షేత్రముగా" నామకరణం చేయడం సంతోషించ దగ్గ పరిణామమని తెలియచేస్తూ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంకు ఆర్యవైశ్య సభ తరపున ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమం నందు కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఇతర అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## డివిజన్ సాధన సమితికి మాజీ ఎమ్మెల్యే సంఘీభావం



దీక్ష శిబిరం లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

పీలేరు నవంబర్ 1 ప్రభాతవార్త:

పీలేరు పట్టణ కేంద్రంగా 3 రోజులుగా పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు విస్తృత మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి, సాధన సమితి నాయకులకు పూలమాల వేసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు ప్రాంతం భౌగోళికంగా, పరిపాలనా దృష్ట్యా రెవెన్యూ డివిజన్ స్థాయి గుర్తింపు పొందడానికి అన్ని అర్హతలు కలిగింది. ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నిస్వార్థంగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా పీలేరును రెవెన్యూ డివిజన్ కోసం దీక్ష చేస్తున్న ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలకు పీలేరు ప్రాంత ప్రజలు కూడా మద్దతు తెలపాలన్నారు. రిలే నిరాహార దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యేకు పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు, విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్.డి.పి.ఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు ,మాల మహానాడు ఐక్యవేదిక నాయకులు గుర్రం నారాయణ, మాల మహానాడు నాయకులు తుమ్మల ధరణి కుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ, డి.బి.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షులు బద్దె.భాను ప్రకాష్, ఎన్.ఎస్.యూ.ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్, వైయస్సార్ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు మాలతోటి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో స్పందించిన చాపాడు పోలీసులు

చాపాడు. నవంబర్ 1.ప్రభాతవార్త :



మండల పరిధిలోని ప్రొద్దుటూరు నుండి మైదుకూరుకు వెళ్లే నేషనల్ హైవే కొత్త బ్రిడ్జి దగ్గర శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాపాడు పోలీసులు సకాలంలో స్పందించడంతో ఇరువురు యువకుల ప్రాణాలు కాపాడారు. వివరా వివరాలలోకి వెళితే ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందినతాటి బాబా,షేక్ అజయ్ భాషలు మైదుకూరు నుండి ప్రొద్దటూరుకు ద్విచక్ర వాహనంలో ప్రయాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు నేషనల్ హైవే బ్రిడ్జి దగ్గర ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలుఅయ్యాయి. విషయం తెలుసుకున్న చాపాడు ఎస్ఐ చిన్న పెద్ద ఆధ్వర్యంలోని పోలీసు బృందం సకాలంలో క్షతగాత్రులకు ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ సంస్థల పనితీరుపై అవగాహన

సిద్ధవటం నవంబర్ 1 ప్రభాతవార్త



స్థానిక సంస్థలైన పంచాయతీలు, మండల పరిషత్తుల పనితీరును విద్యార్థులు తప్పని సరిగా తెలుసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు దేశానికి పట్టుకొమ్మలని వాటినిర్మాణం, విదుల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవడం అవసరమన్నారు. ప్రతి పల్లెలోని పారిశుధ్యం, నీటి సరఫరా 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంకా జనన మరణ ధ్రువపత్రాలు , రేషన్ కార్డులు మొదలైన వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇంకా ఈనాటి సమావేశంలో సైన్స్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, స్థానిక సంస్థల పనితీరు మెరుగుపరచడానికి విద్యార్థుల ఆలోచనలు ఉపయోగపడతాయన్నారు. అక్టోబర్ నెలలో జరిగిన స్థానిక ప్రభుత్వ సంస్థల పనితీరు అనే అంశంపై ఇచ్చిన ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులు సమర్పించడం జరిగింది. నాణ్యమైన ప్రాజెక్టులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ

రాయచోటి నవంబర్ 1 ప్రభాతవార్త



సిఎం, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో మేస్త్రి కాసిం సాబ్ విధి మార్కెట్ వీధుల నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సచివాలయ అధికారులతో కలిసి పంపిణీ కార్యక్రమంలో గాజుల ఖాదర్బాష పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వృద్ధులు వితంతువులు వికలాంగులు చంద్రబాబు నాయుడికి దీవెనలు అందిస్తున్నారన్నారు.

## పింఛన్ల పంపిణీలో నిమ్మనపల్లి మొదటి స్థానం

నిమ్మనపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త

మండలంలో ఎన్టీఆర్ భరోసా కింద 96శాతం పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పంపిణీ చేస్తున్న పింఛన్లను ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో వివిధ రకాల పింఛన్లను 96 శాతం పంపిణీ చేసి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వివిధ రకాల పింఛన్లు 5040 ఉండగా 4831 మందికి పింఛన్లు పంపిణీ చేసి మొదటి స్థానంలో నిలిచారు. ఈ పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



